క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: చెట్ల కొమ్మలు కొట్టివేస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సతీశ్‌కుమార్ తెలిపారు. ఎన్‌ఎఫ్‌సీనగర్ ఫీడర్ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీనగర్, బొక్కొనిగూడ, దత్తాత్రేయనగర్, పరమేశ్వరీనగర్ కాలనీల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మంత్రి పర్యటన

మేడ్చల్‌రూరల్: మండలంతో పాటు మున్సిపాలిటీలో శుక్రవారం మంత్రి మల్లారెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కండ్లకోయ–గౌడవెల్లి బీటీ రోడ్డు పనులకు శంకుస్థాన, 10.30 గంటలకు ధ్రువ కళాశాల సమీపంలో మార్కెట్ కమిటీ గోదాం, భవనానికి భూమిపూజ, 11.30గంటలకు మేడ్చల్ పట్టణంలో ఏర్పాటు చేసిన మేడ్చల్ పీఏసీఎస్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ భవనానికి రూ.10 లక్షల నిధులు



దళితసేనా నాయకులకు ప్రొసిడింగ్ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్మించతలపెట్టిన అంబేడ్కర్ భవనానికి మంత్రి మల్లారెడ్డి రూ.10 లక్షల నిధులను మంజూరు చేస్తూ గురువారం దళితసేనా నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యెల్లుబాయి, దళితసేనా మండల అధ్యక్షుడు మురళి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుదర్శన్, ఉపసర్పంచ్ రమేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎస్సీ కాలనీలోని పోచమ్మ ఆలయ నూతన కమిటీ గురువారం ఎన్నుకున్నారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షుడిగా డప్పు పెద్ద కృష్ణ, ఉపాధ్యక్షులుగా ముక్కిడిగాళ్ల వెంకటేశ్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డప్పు నర్సింగ్‌రావు, కుండ భానుచందర్, మహేశ్, రవి, బాలేశ్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బలిరాం



జవహర్‌నగర్: వెటర్నరీ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా నాగారం పశువైద్యాధికారి డాక్టర్ కె.బలిరాం ఎన్నికయ్యారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాజీ అధ్యక్షుడు డాక్టర్ కురుమూర్తి, డాక్టర్ నిహారిక, డాక్టర్ ఎం.విశాల్‌కుమార్‌ల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మేడ్చల్ జిల్లా వెటర్నరీ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ బలిరాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం.పద్మిని, డాక్టర్ ఎం.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వినయ్ రత్నాలికర్, కోశాధికారిగా డాక్టర్ ఎం.తిరుపతి, అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ శ్యామలనాయుడు, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ ఎస్.స్వాతి, డాక్టర్ ఎస్.వాసు, డాక్టర్ బి.బీక్యా, డాక్టర్ టి.శైలజ, డాక్టర్ కళ్యాణిలను ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి



బీఆర్ఎస్‌లో చేరుతున్న గోధుమకుంట టీపీఎస్ కాలనీ అసోషియేషన్ సభ్యులు

కీసర: బీఆర్ఎస్‌తో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు, నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం గోధుమకుంట గ్రామం టీపీఎస్ కాలనీకి చెందిన అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, సెక్రటరీ భారతీ, శేఖర్‌రెడ్డి, రమేష్, ఆంజనేయులు, అనసూయ తదితరులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వంగేటి పర్వత్‌రెడ్డి, నేతలు చీర కృష్ణ, రమేష్‌గౌడ్, పోల్‌మర్ప్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడి పనులు

మన ఊరు–మనబడి కింద రూ.72 కోట్లు 176 ప్రభుత్వ బడుల్లో అదనపు గదుల నిర్మాణం, మరమ్మతులకు శ్రీకారం

- ఇప్పటి వరకు పూర్తయింది 30 పాఠశాలల్లోనే..
- పర్యవేక్షణ లోపంతో నత్తనడకన పనులు
- మే నెలాఖరుకు పూర్తి చేయాలన్న కలెక్టర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: కార్పొరేట్ స్థాయి విద్య, సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ‘మన ఊరు – మన బడి’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు రూ.72 వేల కోట్లు కేటాయించింది. ఇంత వరకు బాగానే ఉన్నా పనుల్లో నత్తనడక.. అధికారుల పర్యవేక్షణ లోపంతో పథకం ఉద్దేశం నెరవేరకుండా పోతోంది.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 505 పాఠశాలలు ఉండగా.. అందులో ప్రాథమిక పాఠశాలలు 375, యూపీఎస్‌లు 22, ఉన్నత పాఠశాలలు 108 ఉన్నాయి. ఈ ప్రభుత్వ బడుల్లో ‘మన ఊరు – మన బడి’ కింద తొలి విడతలో 176 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో 106 ప్రాథమిక పాఠశాలలు, 6 యూపీఎస్‌లు, 61 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిని కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. అధికారులు పర్యవేక్షణ లోపం, సకాలంలో నిధులు విడుదలకాక జాప్యం చోటుచేసుకుంటోంది.

నాసిరకం ఇసుక, ఇటుకలు..

ఇదే అదనుగా కాంట్రాక్టర్లు స్థానికంగా లభించే నాసిరకం ఇసుక, ఇటుకలను వాడుతూ పనులు చేస్తున్నారు. ఇంత చేసినా.. ఇప్పటి వరకు 30 పాఠశాలల్లో నిర్మాణ, మరమ్మతులు పూర్తిగా, మరి కొన్నింటిలో 60 శాతం పనులు పూర్తయినట్లు జిల్లా విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే మే నెలాఖరు వరకు పనులు పూర్తయ్యేలా కలెక్టర్ అమయ్‌కుమార్ సంబంధిత అధికారుల సమీక్షలతో ఒత్తిడి తెస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే జూన్‌లో విద్యార్థులు, టీచర్లు కొత్త తిప్పలు పడాల్సి వస్తుందనే ఆందోళన అప్పుడే మొదలైంది.

ఫర్నిచర్, బల్లలు కొన్నింటికే..!

జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో పదుల సంఖ్యలో బడులకే ఫర్నిచర్, గ్రీన్ బోర్డు వంటివి సమకూర్చారు. పట్టణ ప్రాంతాల్లో బడులకు రంగులు వేయడం, టాయిలెట్లు, వంటగదులు, తాగునీటి వసతి పనులు సగం బడుల్లో పూర్తయినా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు గదులు, నాణ్యత దేవుడెరుగు.. జరగాల్సిన పనుల్లోనూ ఏమాత్రం వేగం లేదు. మే నాటికి పనులు పూర్తవడం కష్టంగానే కనిపిస్తోంది.

పూర్తయ్యేదెన్నడో..?

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల పరిధిలో అదనపు గదుల నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయి. ఈ వేసవిలో గదుల నిర్మాణం పూర్తవడం కష్టమేననిపిస్తోంది. గదులు పూర్తికాకుంటే వానాకాలంలో ఇక్కట్లు తప్పవని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా అని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. గురువారం చైర్ పర్సన్ నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కు అందజేశారు. ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన పవన్ లాల్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా ఆయనకు మంజూరైన రూ.27,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధితుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు దేవేందర్ ముదిరాజ్, ఆంజనేయులు, రాధాకృష్ణముదిరాజ్, నాగభూషనం, రవి, సురేశ్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ధూంధాం మల్లేశ్వరీ బృందం



ఘట్‌కేసర్: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఘట్‌కేసర్‌కు చెందిన ధూంధాం ముచ్చట్ల మల్లేశ్వరీ సీఎం కేసీఆర్‌ను తెలంగాణ భవన్‌లో గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని సీపీఐ వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మేడ్చల్: రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేష్ అన్నారు. ఖాళీలను భర్తీ చేయాలని ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షలకు పైగా ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేడ్చల్‌లో రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి డీజీ సాయిలుగౌడ్, మండల కార్యదర్శి శశిధర్‌రెడ్డి, నాయకులు దశరథ్‌రాములు గౌడ్, శంకర్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు ఆర్థిక సాయం



యాదగిరికి ఆర్థిక సాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు కష్టకాలంలో తాను అండగా నిలవడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు భాగ్యనగర్‌కాలనీకి చెందిన వెంకటాపురం యాదగిరిని పక్షవాతంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆయనను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ



మేడ్చల్: బీఆర్ఎస్ అనుబంధ కార్మిక యూనియన్ బీఆర్‌టీయూ రూపొందించిన మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. మేడ్చల్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మిక నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించి మేడ్చల్‌లో మేడేని ఘనంగా నిర్వహించాలన్నారు. మేడే ఉత్సవాల్లో ప్రతిరంగం కార్మికుడు పాల్గొనాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. కార్యక్రమంలో మండల, మున్సిపల్ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

నూతన్‌కల్‌లో బెల్టు షాపులు తొలగించాలి



నూతన్‌కల్ గ్రామసభ

మేడ్చల్: మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో ఉన్న బెల్టుషాపులను వెంటనే తొలగించి నూతనంగా ఏర్పాటు చేయవద్దని గ్రామ ప్రజలు తీర్మానం చేశారు. గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు, నాయకులు పాల్గొని వెంటనే బెల్టు షాపులు తొలగించాలని అన్నారు. కిరాణా షాపుల ముసుగులో మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తున్నారని బెల్టు షాపులు లేని గ్రామంగా నూతన్‌కల్ గ్రామాన్ని తీర్చిదిద్దాలని కోరారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ కవిత జీవన్, ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేష్ రెడ్డి, గ్రామస్తులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

మేడ్చల్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ వివరాల ప్రకారం.. కండ్లకోయలోని ఓఆర్ఆర్ ఎంట్రీ పాయింట్ సమీపంలోని అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద కొంపల్లి వైపు వెళ్లే దారిలో రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఘటన స్థలికి చేరుకుని పరిశీలించగా సదరు వ్యక్తి మృతిచెందినట్లు గుర్తించారు. చుట్టుపక్కల మృతుడి వివరాల కోసం ఆరా తీసినా ఎలాంటి వివరాలు తెలియలేదు. దీంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 40–45 ఏళ్ల మధ్య ఉంటుందని, వివరాలకు మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య



పద్మారెడ్డి(ఫైల్)

జవహర్‌నగర్: ఆరోగ్యం బాగాలేకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీతారాం వివరాల ప్రకారం.. గొంగిరెడ్డి పద్మారెడ్డి(75) జమ్మిగడ్డలోని తన కుమారుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. పద్మారెడ్డి ఎలర్జీ, గ్యాస్ సమస్య, ఉబ్బసం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతుండేవాడు. ఈ నెల 25వ తేదీన అతడి కుటుంబసభ్యులు వారి సొంతూరు సిద్దిపేటకు వెళ్లారు. గురువారం పని మనిషి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో ఒంటరిగా ఉన్న పద్మారెడ్డి తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే తాను పలు వ్యాధులతో చనిపోతున్నానని సూసైడ్ లెటర్ రాసి పెట్టాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ

కీసర: గ్రామాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. గురువారం చీర్యాల గ్రామంలో రూ.10 లక్షల పంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆమె సర్పంచ్ తుంగ ధర్మేందర్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చౌదరిగూడ బీసీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న వజ్రేశ్‌యాదవ్, రాజేశ్, ఆంజనేయులు

రైతన్నలు కష్టాల్లో ఉంటే.. బీఆర్ఎస్ సంబరాలు

టీ పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: రైతన్నలు ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షాలకు నేలపాలైతే అధికార పార్టీ నేతలు ఆత్మీయ సమ్మేళనాల పేరుతో సంబరాలు చేసుకుంటున్నారని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ ఎద్దేవా చేశారు. టీ పీసీసీ పిలుపు మేరకు ఘట్‌కేసర్ మండల శాఖ, చౌదరిగూడ అధ్యక్షుడు రాజేష్, ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో చౌదరిగూడ, కాచవానిసింగారంలో గురువారం నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసి అన్నదాతలను ఆదుకుందని, నేటి ప్రభుత్వం కనీసం పంట నష్టం అంచనా వేయడం లేదన్నారు. అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో అన్నదాతలను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత, వైస్ ఎంపీపీ జంగమ్మ, బోడుప్పల్ కార్పొరేటర్ అజయ్‌యాదవ్, జవహర్‌నగర్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, మూడు చింతలపల్లి మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, భోజిరెడ్డి, నర్సింగ్‌రామ్‌ముదిరాజ్, శేఖర్‌రెడ్డి, సుధాకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్, మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి



హాథ్ సే హాథ్ జోడో యాత్రలో కాంగ్రెస్ నాయకులు

శామీర్‌పేట్: ప్రజా విశ్వాసాన్ని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంటోందని కాంగ్రెస్ జిల్లా ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి హరివర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మున్సిపాలిటీ పరిధిలోని ఎలిగెలగూడెం, ఉప్పరిపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా గడపగడపకూ తిరుగుతూ రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన సందేశాన్ని కరపత్రం ద్వారా అందజేశారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధికార ప్రతినిధి సురేందర్‌ముదిరాజ్, మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోశాధికారి నర్సింహారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వీ హబ్‌తో మల్లారెడ్డి మహిళా కళాశాల ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటూ..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ కళాశాల వీ హబ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొంది. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, వీ హబ్ డైరెక్టర్ దీప్తి ఈ మేరకు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో మహిళా పారిశ్రామికవేత్తలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయని వారికి మద్దతుగా నిలిచేందుకు దోహదపడుతుందని ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలకు వారి వ్యాపారాలను ప్రారంభించడంలో, అభివృద్ధి చేయడంలో సహకారం అందించేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈసీలో గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్



గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో సంస్థ ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి కళాశాలలో గురువారం గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ నిర్వహించారు. సైన్ ఇమ్మిగ్రేషన్ సర్వీస్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మిట్‌లో పాల్గొన్న సైన్ ఐఎమ్మెస్ ఆపరేషన్స్ హెడ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం వివిధ దేశాలకు వెళ్లాలనుకునే పేద విద్యార్థులకు తమ సంస్థ ఎలాంటి ఫీజు తీసుకోదన్నారు. పేద విద్యార్థులకు తమ సంస్థ అందుబాటులో ఉండి సేవలు అందిస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లోకనాథం మాట్లాడుతూ ఇలాంటి సమ్మిట్స్ విద్యార్థులకు ఎంతో లాభదాయకమని, విదేశాల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలతో అవగాహన పెరుగుతుందని తెలిపారు. సమ్మిట్‌లో యూఎస్ఏ, జర్మనీ, దుబాయ్, మాల్టా తదితర దేశాలకు చెందిన 25 యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొని ఆయా యూనివర్సిటీలో ప్రవేశాల దరఖాస్తు విధానం, ఎలా వెళ్లాలి..? విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. సమ్మిట్‌లో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, సంస్థ ప్రతినిధి వీరేంద్రనాథ్, వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులను అందజేస్తున్న టీచర్ సునీత

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ పిల్లల అభివృద్ధిపై ప్రోగ్రెస్ కార్డు తయారు చేసి వారి తల్లులకు అందజేశారు. అలాగే ఏడాదిగా పిల్లలు నేర్చుకున్న అంశాలపై తల్లులకు అంగన్‌వాడీ టీచర్ సునీత వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సునీత, హెల్పర్, లక్ష్మీ, తల్లులు నాగమణి, మౌనిక, భాగ్యలక్ష్మీ, మనోహర, మహేశ్వరీ, సుమలత, లావణ్య తదితతరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

గౌతంనగర్: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి శనివారం లక్ష్మీసాయి గార్డెన్స్‌లో ఎస్ఆర్ఆర్ జాబ్‌మేళా నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు అన్నారు. నారపరాజు సావిత్రి ఫౌండేషన్, బీఎస్ఎస్ఎఫ్, అన్నావఝల చారిటబుల్ ట్రస్ట్, హైర్ ది బెస్ట్ బ్రెయిన్ సంస్థల సౌజన్యంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టెన్త్ పాస్, ఫెయిల్, ఇంటర్, డిగ్రీ, పీజీ, టెక్నికల్, ఇంజినీరింగ్ వారికి ఐటీ, నాన్‌ఐటీ, ఫార్మా, విద్యారంగం, తయారీ, హోటల్ మేనేజ్‌మెంట్ తదతర ఉద్యోగాల్లో అవకాశాలు ఉంటాయన్నారు. ఎంట్రీ ఫీజు లేదన్నారు. భోజన వసతి ఉందన్నారు. ఫోన్: 89784 05740.

చికిత్స పొందుతున్న ఖైదీ మృతి

కుషాయిగూడ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ ఖైదీ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చోరీ కేసులో నిందితుడిగా ఉన్న కనపర్తి సత్యం(38) కరీంనగర్ జిల్లా కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. ఆయనను మెరుగైన వైద్యం కోసం 2 నెలల క్రితం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. జైలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో 20న గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన కార్డియాక్ అరెస్టు కావడంతో గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. జైల్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.